5 నుంచి ఆన్‌లైన్‌లో కిడ్స్ ఆర్ట్ క్యాంపు

నాంపల్లి: వేసవి సెలవుల్లో బాలబాలికలకు కిడ్స్ ఆర్ట్ క్యాంపు పేరిట ఆన్‌లైన్ డ్రాయింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులు మే 5 నుంచి జూన్ 5వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. డ్రాయింగ్ తరగతులకు హాజరుకావాల్సిన వారు ముందుగా తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 63043 66780లో సంప్రదించవచ్చు.

అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం గోల్కొండలో జరిగిన మజ్లిస్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీని విమర్శించే వారు ముందుగా తమ పార్టీ ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తుందో చూడాలన్నారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చొరవతో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. దళితులకు ప్రభుత్వ పరంగా అందుబాటులో ఉండే పథకాలను దళితలకు అందించేందుకు తమ పార్టీ తీవ్రంగా కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, అజీజ్‌ఖాన్, హారూన్‌ఫరాన్, షకీల్‌అలీఖాన్, గౌస్‌భాయ్ తదితరులున్నారు.

హజ్ యాత్రకు వెళ్లే వారికి సేవ చేయడం అదృష్టం


హజ్ యాత్రికుల వ్యాక్సిన్ కేంద్రంలో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: హజ్ యాత్రకు వెళ్తున్న వారికి సేవలు చేస్తున్న వారు అదృష్టవంతులని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ యాత్రకు ఎంపికైన వారికి ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ, టోలిచౌకీ పరిసర ప్రాంతాల నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం వ్యాక్సినేషన్ కేంద్రాన్ని గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు కావడం గొప్ప విషయమన్నారు. వ్యాక్సిన్ కేంద్రాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్న ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహారుల్లాను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి లియాకత్ హుస్సేన్, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్‌రావు, ఏఓ శ్రీనివాసరావు, గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటిటీ సభ్యులు ఆబిద్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పంకజ్ షిండే



గౌలిపురా: లాల్‌దర్వాజాకు చెందిన ఓంకార్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పంకజ్ షిండే తన అనుచరులతో కలిసి బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షిండేకు కండువా కప్పి పార్టీలోకి కేటీఆర్ సాదరంగా స్వాగతించారు. అనంతరం కేటీఆర్‌ను పంకజ్ షిండే శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. పంకజ్ షిండే మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేలా క్షేత్రస్థాయిలో పని చేస్తామన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పార్టీ అభ్యర్థి విజయం కోసం ఇంటింటి ప్రచారాలను కొనసాగిస్తామని తెలిపారు.

ముగిసిన ఉధ్యతి-2024 ఫెస్ట్



లంగర్‌హౌస్: విద్యార్థుల్లో ప్రణాళిక, సమన్వయం, సమష్టి కృషి పెంపొందించడంలో పోటీ కార్యక్రమాలు దోహదపడుతాయని వాసవీ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ కోశాధికారి వీఎం పార్థసారథి అన్నారు. ఇబ్రహీంబాగ్‌లోని పెండెకంటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన ఉధ్యతి-2024 ఫెస్ట్ కార్యక్రమాలు ముగిశాయి. ఇందులో భాగంగా స్టార్టప్, మార్కెటింగ్, ఫైనాన్స్, యంగ్ మేనేజర్ వంటి కార్యక్రమాల్లో నగర నలుమూలల నుంచి వివిధ ఎంబీఏ కళాశాలల విద్యార్థులు పోటీపడుతూ వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వాసవీ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ సంయుక్త కార్యదర్శి ఆనంద్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ కస్తూరి రంగన్ మాట్లాడుతూ..ఇలాంటి పోటీ కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ఆలోచన శక్తి ఉత్పత్తి అవుతుందన్నారు. 12వ ఉధ్యతి కార్యక్రమంలో స్టార్టప్ దిశగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు.

అల్లుడిని హత్యచేసిన తండ్రీ కొడుకుల రిమాండ్

నాంపల్లి: తాగిన మైకంలో ఘర్షణకు దిగిన అల్లుడిపై మామ, బావమరిది కత్తులతో దాడి చేయగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘ టన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు వివరాల ప్రకారం.. పాత మల్లేపల్లిలో నివాసముండే మహ్మద్ అయూబ్(39) ప్లంబరుగా పనిచేసేవాడు. అయూబ్‌కు పిల్లనిచ్చిన మామ మొయినుద్దీన్ మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తారు. ఈ నెల 27న తాగిన మైకంలో మహ్మద్ అయూబ్ మొయినుద్దీన్‌ల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో మహ్మద్ అయూబ్ చేతిలో ఉన్న కత్తిని మొయినుద్దీన్ కుమారుడు బాబా లాక్కొని అయూబ్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో అయూబ్ తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మొయినుద్దీన్, బాబాను రిమాండ్‌కు తరలించారు.

కమలనాథుల్లో కొత్త జోష్


లాల్‌దర్వాజ సింహవాహిణి ఆలయం వద్ద నెలకొన్న సందడి

చాంద్రాయణగుట్ట: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పాతబస్తీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్వహించిన రోడ్డు షో కమళనాథుల్లో కొత్త జోష్ నింపింది. సాయంత్రం నుంచే రోడ్డు షో ప్రారంభమవుతుందన్న పార్టీ ఇచ్చిన సమాచారంతో నాయకులు, కార్యకర్తలు ఆరు గంటల నుంచే లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయానికి చేరుకున్నారు. నియోజకవర్గాల ప్రధాన నాయకులు లాల్‌దర్వాజా నుంచి 20 మీటర్లకు ఒక దగ్గర స్వాగత వేదికలు ఏర్పాటు చేసుకొని బేలా లైబ్రరీ వరకు పూలు చల్లుతూ, బతుకమ్మల ఊరేగింపు, బోనాలు తీస్తూ, మోదీ, అమిత్ షా ముఖ కటౌట్లు ప్రదర్శించారు. కాగా రోడ్ షో కాస్త ఆలస్యమైనప్పటికీ, ప్రారంభమైన అనంతరం జోష్ కనిపించింది. కేవలం 25 నిమిషాల సమయం మాత్రమే ఉండడంతో ఎక్కడ ఆగకుండా షో ముందుకు


మాధవీలత, రాజాసింగ్‌తో ఆలే భాస్కర్ రాజ్

సాగింది. రోడ్డు షో పొడువునా బీజేపీ భాగ్యనగర జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఆలే జితేంద్ర, పాశం సురేందర్, ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్, మౌనిక సుంకర, వీరేంద్ర బాబు, గ్యార ప్రభాకర్, కౌడీ మహేందర్, వై.నరేష్, మేఘా రాణి అగర్వాల్, నవీన్ యాదవ్, తాడెం శ్రీనివాసారావు, జాలిగం చిరంజీవి, ఎడ్ల పండరీనాథ్, కుమార్, పెండెం లక్ష్మణ్, జమాల్‌పూర్ చంద్రశేఖర్, అశోక్, పొన్న శ్రీనివాస్‌రావులు ఈ సారి బీజేపీని గెలిపిస్తామని వేదికపై ప్రసంగించారు.

అమిత్ షా రోడ్డు షో విజయవంతం

గౌలిపురా: పాతబస్తీలో అమిత్ షా రోడ్డు షో విజయవంతం అయ్యిందని..ఈసారి హైదరాబాద్ పార్లమెంట్ తమదేనని బీజేపీ ఓబీసీ సెల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి బలే చౌరస్తా వద్ద హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత, ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి ఆయన రోడ్డు షో లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు షో విజయవంతంతో బీజేపీ కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. ఈ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానాన్ని తమ పార్టీ అభ్యర్థి మాధవీలత కైవసం చేసుకుంటుందన్నారు.

తెలంగాణపై మోదీ, అమిత్ షా కపట ప్రేమ


మాట్లాడుతున్న గౌరీ సతీష్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న హామీలను ఇంకా పూర్తి చేయని మోదీ, అమిత్‌షా తెలంగాణ ప్రజలపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరీ సతీష్ మాట్లాడుతూ..తెలంగాణ విభజన చట్టంలో పొందుపరిచిన బయ్యారం ఉక్కు కర్మాగారం కానీ, వరంగల్‌లో రైల్వే కోర్చు ఫ్యాక్టరీ కానీ, ఐటీఆర్ కానీ ఇంత వరకు ఎందుకు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలపై మోదీకి కానీ, అమిత్‌షాలకు కానీ ఎలాంటి ప్రేమ లేదన్నారు. కేంద్రంలో ఓడిపోతామనే భయంతోనే తెలంగాణ మీద పడి మోదీ, అమిత్‌షా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రగతి, సంక్షేమానికి ఆకర్షితులై ప్రజలంతా కాంగ్రెస్ పార్టీనే ఆదరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి 15 ఎంపీ స్థానాలు రావడం ఖాయమని గౌరీ సతీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శన్, మానయ్య, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీలకరణకు మద్దతు ప్రకటించాలి


బషీర్‌బాగ్ చౌరస్తాలో ఆందోళన వ్యక్తం చేస్తున్న నవీన్‌రాజ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తూ ప్రకటన చేయాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.నవీన్‌రాజ అన్నారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాదిగల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాల సామాజిక వర్గానికి మూడు ఎంపీ సీట్లు కేటాయించి మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగా మద్దతును ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మాదిగల ఓట్లు కాంగ్రెస్‌కు పడవు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ములుగు కోటేశ్వర్‌రావు, సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగదీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే హైదరాబాద్ అభివృద్ధి'



అబిడ్స్: బీఆర్ఎస్‌తోనే హైదరాబాద్ అభివృద్ధి కొనసాగుతుందని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. పదేళ్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వందల కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు చేశారన్నారు. అఫ్జల్‌గంజ్, గౌలిగూడ, అశోక్‌బజార్, సిద్దిఅంబర్‌బజార్ తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, మజ్లిస్‌లు కేవలం మతం పేరు చెప్పి ఓట్లు దండుకుంటున్నాయి తప్పా పాతబస్తీ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయడం లేదన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్మీ మహేందర్‌కుమార్, పి.నరేందర్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన అబ్దుల్ రెహమాన్



నాంపల్లి: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నగర అధికార ప్రతినిధి అస్లం అబ్దుల్ రెహమాన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అస్లం అబ్దుల్ రెహమాన్‌ను సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ప్రజా సమితి, తెలంగాణ ప్రజా ఫ్రంట్‌లలో పనిచేస్తూ తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులయ్యారు. ఉద్యమంలో చురుగ్గా పనిచేసి బీఆర్ఎస్‌లో చేరారు. నాంపల్లి నియోజకవర్గానికి చెందిన మైనార్టీ నేత అబ్దుల్ రెహమాన్‌కు బీఆర్ఎస్‌లో సరైన గుర్తింపు లభించకపోవడంతో ప్రస్తుతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పీర్ అలీ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి


పీఆర్‌సీ కమిటీకి వినతిపత్రం సమర్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్‌సీని 40 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఆర్‌సీ కమిటీని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యోగులకు 2023 జులై 1 నుంచి రావాల్సిన పీఆర్‌సీని 40 శాతం ఫిట్‌మెంట్‌తో చెల్లించాలని కోరినట్లు తెలిపారు. అలాగే సమాన పనికి సమాన వేతనంతో పాటు మాస్టర్స్ స్కేల్ కనీసం రూ.35 వేలు 2.7 ఇంక్రిమెంట్‌తో పాటు 3శాతం ఇతర అలవెన్స్‌తో హెచ్ఆర్ఏ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాబర్ట్ బ్రూస్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ఐక్వాక్ నేషనల్ సెమినార్


సెమినార్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ సిస్టర్ విజయరాణి, ప్రొ. జయశంకరన్

గోల్కొండ: డిజిటల్ టీచింగ్, లెర్నింగ్ పద్ధతులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటే విద్యాబోధన మరింత ఆకర్షనీయంగా ఉంటుందని కంచి విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, బీఐఎం డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ ఎస్.జయశంకరన్ అన్నారు. మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్(ఐక్వాక్) జాతీయ సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ కంటెంట్ క్రియేషన్, ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్, ఏఐగేమ్ బేస్డ్ లెర్నింగ్ సూత్రాలపై సెషన్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ సెమినార్‌లో వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది అధ్యాపకులు పాల్గొని తమతమ పత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఏ.విజయరాణి, కరస్పాండెంట్ సిస్టర్ దయాకుమారి, అకాడామిక్స్ డీన్, ఐక్వాక్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్మిత ఆస్తానా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలి


వేడుకలను ప్రారంభిస్తున్న ప్రొ. లింబాద్రి, గౌరవ కార్యదర్శి సురేందర్‌రెడ్డి

అబిడ్స్: మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి పేర్కొన్నారు. విద్యారంగంలో మారుతున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రత్యేక కృషి చేయాలన్నారు. బుధవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సర్దార్ పటేల్ కళాశాల కాలేజ్ డే వేడుకలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఎస్‌పీ కళాశాల విద్యారంగ వ్యాప్తికి అమోఘంగా కృషి చేస్తున్నామన్నారు. ఎస్‌పీ కళాశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు నేడు దేశంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఉన్నత విద్యామండలి కూడా మారుతున్న విప్లవాత్మక టెక్నాలజీకి అనుగుణంగా పలు నూతన కోర్సులను ప్రవేశపెడుతూ వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఎస్‌పీ కళాశాలతో పాటు తెలంగాణ వ్యాప్తంగా పలు కళాశాలలు నడుపుతూ విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.రాజేందర్, కళాశాల గౌరవ కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ..తమ కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులకు విద్య ఎంత అవసరమో క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాలు కూడా అంతే అవసరమని వారిని ఆయా రంగాల్లో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కళాశాల యాజమాన్యం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓజీఏ అధ్యక్షుడు ప్రొఫెసర్ టీవీ.గోపాల చారి, సుజిత్ సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, టీపీ కృష్ణ, జి.రాహుల్ యాదవ్, ముదిగొండ అమర్నాథ్‌శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ అందరిని అలరించారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటమి తప్పదు'


దానం నాగేందర్‌ను సత్కరిస్తున్న అరుణ్‌కుమార్, సూరి, సంతోష్‌యాదవ్

అబిడ్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటమి తప్పదని కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. గొల్ల కురుమలతో పాటు అన్నివర్గాల ప్రజలు సికింద్రాబాద్ నలుమూలలా కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. బుధవారం రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, బండ్ల సూరిల ఆధ్వర్యంలో నాంపల్లి నియోజకవర్గానికి చెందిన మహవీర్ యాదవనగర్ గొల్లకురుమలు దానం నాగేందర్‌ను సత్కరించి కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ..గొలకురుమలతో పాటు పలు కుల సంఘాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలనే కొత్తగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందన్నారు. అన్ని కుల సంఘాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండి వారి సంక్షేమానికి విశేష కృషి చేస్తుందన్నారు. ఐదేళ్లుగా ఎంపీ కిషన్‌రెడ్డి మంత్రిగా ఉండి కూడా సికింద్రాబాద్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలంతా ఆయన పట్ల తీవ్ర ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ధన్‌రాజ్ యాదవ్, గుంటి సంతోష్‌యాదవ్, రావుల వంశీ, అర్జున్, కొమ్ము హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పని చేసే వారికే ఓటు వేయండి

– ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


ఇంటింటికీ మజ్లిస్ ప్రచారంలో హైదరాబాద్ అభ్యర్థి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: పని చేసే పార్టీ అభ్యర్థులకే ఓటు వేయాలని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. హైదరాబాద్ ఎంపీగా తాను మరోసారి పోటీ చేస్తున్నానని గతంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఆయన ఓటర్లను కోరారు. మజ్లిస్ పార్టీ ఎప్పుడు కూడా అమలుకు సాధ్యం కాని హామీలు ఇవ్వదని ప్రజల కనీస సౌకర్యాల కోసం అధికారంలో ఉన్న వారితో పోరాడి నిధులు సాధిస్తుందన్నారు. అయితే నేడు కొన్ని పార్టీల వారు ఊరు పేరు తెలియని అభ్యర్థులను తనకు పోటీగా నిలబెట్టారని ఆయన ఎద్దేవ చేశారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పెద్దలు తనను ఓడించడానికి కుట్రలు పన్నుతున్నారని నిజానిజాలు హైదరాబాద్ ప్రజలందరికీ తెలుసు అని ఆయన అన్నారు. ఈ నెల 13న జరిగే ఓటింగ్ రోజున ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఆయన వెంట కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు ఏకే పఠాన్, షకీల్‌అలీఖాన్, వజీఉజ్ జమా, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

రేపు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌కు సన్మానం



అబిడ్స్: ప్రముఖ సంఘ సేవకుడు, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌కు మే 3న అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో సన్మానం చేయనున్నట్లు యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ ఏ డైని తెలిపారు. ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ శాంతి, జాతీయ సమైఖ్యత, మతసామరస్యం, క్షయ, ఎయిడ్స్ నివారణ, కేన్సర్, గుండె, మధుమేహం, ధూమపానం, న్యాయ చట్టాలపై అవగాహన శిబిరాలను, కాలుష్యం నియంత్రణకు, మాదకద్రవ్యాల వ్యతిరేకంగా, సమాజాభివృద్ధి సంక్షేమం కోసం హైపర్‌టెన్షన్ మొదలగు అంశాలపై 40 ఏళ్లుగా కృషి చేస్తూ ప్రజలను సదస్సులు, ర్యాలీల ద్వారా కొన్ని వేల కార్యక్రమాలు నిర్వహించినందుకు రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను గుర్తించి సన్మానిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా కొనసాగుతూ కార్యక్రమాలు నిర్వహిస్తూ కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వాలు, గవర్నర్లు, రాష్ట్ర హైకోర్టు జడ్జిల ద్వారా ఎన్నో అవార్డులు అందుకున్నారు.

'బీఆర్ఎస్‌ను గెలిపించాలి'



చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం సీనియర్ నాయకురాలు చెన్నయ్యగారి సరిత అన్నారు. జంగమ్మెట్ డివిజన్‌లో ఆమె ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ..పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రూపురేఖలు మారాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే కరువు రాజ్యమేలుతుందన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీలు చెబుతున్న కల్లబొల్లి మాటలను నమ్మరాదన్నారు. పార్టీ నాయకులు రమాకాంత్, బాలమణి, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కార్మికుల దినోత్సవం



ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

జియాగూడ: కార్మికులతోనే దేశ ప్రగతి సాధ్యమని గ్రేటర్ హైదరాబాద్ కార్మిక సంఘం చైర్మన్ ఠాకూర్ జీవన్‌సింగ్, సీఐటీయూ గ్రేటర్ నాయకుడు విఠల్ అన్నారు. బుధవారం మేడేను పురస్కరించుకుని జై దుర్గాభవన్ సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.కుమార్, ప్రధాన కార్యదర్శి జి.రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమానికి హాజరై జెండా ఎగరవేశారు. కోశాధికారి ఎం.బాబు, కె.మల్లేష్, కుమ్మరి యాదగిరి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చౌరస్తాలో..

కార్మికులు హక్కుల కోసం పోరాడి సాధించుకోవాలని సీపీఐఎం జియాగూడ డివిజన్ ఇన్‌ఛార్జ్ అత్తాపూర్ రాజేష్ అన్నారు. బుధవారం మేడేను పురస్కరించుకుని భగత్‌సింగ్ చౌరస్తా, దుర్గానగర్, కుల్సుంపురా 2జే బస్టాప్ జియాగూడ మేకలమండిలలో జెండాలను ఎగరవేశారు. సీపీఐఎం సీనియర్ నాయకులు శ్యామ్, చుక్క నర్సింహ, రాములు, కురుమూర్తి, శశికళ, ముత్యాలు, జీహెచ్ఎంసీ కార్మికులు పాల్గొన్నారు.


జియాగూడలో జెండా ఎగరవేసిన జీవన్‌సింగ్, విఠల్, రమేష్


భగత్‌సింగ్ చౌరస్తాలో జెండా ఎగరవేసిన సీపీఐఎం అత్తాపూర్ రాజేష్

దారుషిఫాలో..

యాకుత్‌పురా: ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దారుషిఫాలో మేడే వేడుకలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు రాజేష్ యాదవ్ జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కార్మికుల సంక్షేమానికి సంబంధించిన బ్యానర్ ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. విజయ్‌కుమార్, విష్ణువర్ధన్, యాదమ్మ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.